# అపాత్ర దానం

- అంబల్ల జనార్ధన్

"ఏందిరో పైడితల్లీ! ఇయ్యాల మీయమ్మ గారు నిన్ను జెల్దిడిసింది?"

"ఔ, రోజుకంటే ఈ యేల కుంచెం బడాన వొదిలింది, కొమురయ్యా."

"ఇయ్యాల ఏందో విసెసమున్నది. నీ గుర్రం గుడా జోరుమీద లేదు"

"చిల్లర లేవని ఈ యేల టిప్పు తక్కువిచ్చింది, దాంతోనే సరిపెట్టిన. గందుకే తొందరగొచ్చిన"

"ఇయ్యాల నీ యాదమ్మ నీ మీద కుశీగుంటది."

"అదెట్లుంటే నాకేం? నా సంపాదన నేను తాగుతున్న. బక్షీస్ ఎక్కువొస్తె నా గుర్రం జోరుకొస్తది, లేకుంటే ఇగో గిట్లుంటది. నా జీతమంత దానికే ఇస్తున్నగదా. దానికి, దాని పిల్లలకి అదే ఎక్క."

"పిల్లలు పెద్దైతున్నరు. కర్సులు పెరుగుతున్నె. ఆల్లను బాగ సదియ్యాలని యాదమ్మ కోర్కె. నీ తాగుడు కొంచెం తక్కజేసి, బచాయించిన పైసలు బ్యాంకుల జమజేత్తె ముంగల ఆల్ల సదులకక్కెరకత్తె గదా?"

"రేపటికి రూపం లేదట. జో భీ హై ఆజ్ హై. ఖావో పీవో మజా కరో, ఇక వొస్తా" పైడితల్లి తన ఇంటివైపుకు సైకిలు మళ్లించాడు.

కొమురయ్య తన ఇంటి తలుపు కొట్టాడు. భార్య తలుపు తీయగానే చేతిలోని టిఫిన్ క్యారియర్ ఆమెకిచ్చి, తను స్నానానికెళ్లాడు. కొమురయ్య స్నానం చేసి రాగానే పిల్లలతో సహా అందరూ భోజనానికి కూర్చున్నారు.

"యేందియ్యాల జెల్దచ్చిండ్రు?" మనెమ్మ అడిగింది.

"మా సారు ఇయ్యాల క్లబ్బుకు పోలె. గందుకని నన్ను జెల్దిడిసిండు."

www.sirimalle.com

"గదిగూడ మంచిదే. పోరగండ్లు ఇయ్యాల గరం గరం తిండి తింటరు. వసుందరమ్మకు రోజు మొక్కాలె. గా యమ్మ రోజు గీ క్యారియరియ్య వట్టి, మనమందురం మంచి బోజినం కడుపునిండ తింటున్నం. డ్రైవర్లను గింత మంచిగ సూసుకుంటోల్లోల్లుంటరు?"

"నివద్దే మనీ! గా తల్లి పున్నాన బాగ బతుకుతున్నం. పిల్లలు మంచి ఇస్కూల్లకు పోతున్నరు. గా యమ్మ దయతోని, నెలనెలా కొన్ని పైసలు బ్యాంకుల జమ అవుతున్నై." కొమురయ్యలో సంతృప్తి.

---

పైడితల్లి, కొమురయ్య ఇద్దరూ డ్రైవర్లే. పైడితల్లి, ఓ సమాజసేవకురాలు పంకజం డ్రైవర్. అతని డ్యూటీ ఉదయం పది గంటలకు మొదలౌతుంది కాని డ్యూటీ నుండి దిగే సమయం మాత్రం చెప్పలేము.

రాత్రి ఒంటిగంటదాకా అమ్మగారి సేవ చేయడం, పైడితల్లి నిత్యకృత్యం. దానికి ప్రతిఫలం కూడా భారీగానే ముట్టజెపుతుంది పంకజం. జీతం కాకుండా, నెల నెలకు దొరికే టిప్పే ఐదారువేలు దాటుతుంది.

ఇక కొమురయ్య యజమాని కృష్ణంరాజు గారు, పెద్ద పారిశ్రామికవేత్త. దినమంతా తన వ్యాపార సామ్రాజ్యంలో తలమునకలై, రాత్రి క్లబ్బులో, మందు, పేకాటతో సేదదీరి, ఏ అర్ధరాత్రికో తన భవనానికి చేరుకుంటాడాయన.

---

మర్నాడు ఉదయం పైడితల్లి, కొమురయ్య, తమ సైకిళ్లపై డ్యూటీకి బయల్దేరారు. ఇద్దరూ ఒకే బస్తీలో ఉండడం, వారి యజమానులు కూడా ఒకే కాలనీలో ఉండడంతో, వారి మధ్య స్నేహితం వృద్ధి జెందింది.

"పైడితల్లీ! మీ అమ్మగారికి మొగుడు పిల్లలు లేరు గదా, పొద్దున్నుంచి గంతరాత్రిదాక ఏం జేత్తది?"

"నీకేం జెప్పాల కొమురయ్యా! మొగుడు లేకుంటెనేం, గా యమ్మకు ఎందరో పెద్ద మనుసులతో సమ్మందాలున్నై. సమాజ సేవ పేరు మీద గాయమ్మకు లక్షల్లో చందాలొస్తయట. అనాతాశ్రమనీ, వృద్ధాశ్రమనీ, మహిలాశ్రమనీ ఆమె ఎన్నో నడుపుతున్నది. కోట్లు విలువజేసే ఎన్నో ఎకరాల భూములు ఆమె అదికారంల ఉన్నై. గా ఆశ్రమాలల్లో ఎవరెవరో నాయకులు, వేపారస్తులు రాత్రిల్లు మీటింగులు పెడుతరు.

www.sirimalle.com

గవన్ని వోల్లకు చెప్పద్దని నాకు భారీగ టిప్పులు ముడుతయి. ఏదో నా దోస్తువని నీతో జెప్పిన, నువ్వోల్లతోటి నోరు జారకు. అది నా పొట్టమీద కాలుపెట్టినట్టైతది. ఆయమ్మేంజేస్తేనేం, నన్ను మాత్రం బాగ సూసుకుంటది."

"నువ్వు గాయమ్మ కాల్లు కూడా ఒత్తుతవంట, గంతేనా ఇంకేమన్న ముందుకు పొయినవా"

"గవన్ని నువ్వడగొద్దు, నేను జెప్పొద్దు. నాకు మాత్రం నా సేవ కంటే ఎక్క ఫలితమే దక్కుతున్నది."

కాలనీ రాగానే ఇద్దరూ, వారి యజమానుల ఇళ్ల వైపు మళ్లారు.

---

రాత్రి 2 గంటలు.

"కొమురన్నా! కొమురన్నా!" దబదబా తలుపు బాదుతూ యాదమ్మ పిలుస్తుండడంతో, కొమురయ్యకు మెళకువొచ్చింది. మనెమ్మ కూడా లేచి తలుపు తీసింది.

ఏమైంది యాదమ్మా! గింత రాత్రచ్చినవ్?" వెక్కి వెక్కి ఏడుస్తున్న యాదమ్మకు నోరు పెగలదం లేదు. వారిని రమ్మని సైగ జేస్తూ, తమ ఇంటి వైపు పరుగెత్తింది. కొమురయ్య, మనెమ్మ ఆమెను అనుసరించారు.

తప్పతాగి సైకిలుపై వస్తున్న పైడితల్లి, అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీ కింద పడి, అక్కడికక్కడే హరీ మన్నాడట. శవాన్ని పోస్టు మార్టంకై ఆస్పత్రికి తరలించారట. మర్నాడు ఉదయానికిగాని శవం దొరుకదట.

యాదమ్మ ఇల్లు, రోదనలతో గింగురుమంది. మనెమ్మ వారిని సాంత్వన పరచడంలో నిమగ్నమైతే, కొమురయ్య మర్నాటి ఏర్పాట్లపై చర్చల్లో పడిపోయాడు. యాదమ్మ దగ్గర చిల్లిగవ్వ లేదు. బస్తీ వాసులే చందాలు వేసుకుని అంత్యక్రియలు జరిపించారు. అందులో సింహభాగం కొమురయ్యే భరించాడు.

---

"యాదమ్మ బతుకు అన్నలమైపాయె గదా? పొయినోడు మంచిగనే పోయిండు గని ఉన్నోల్లకు తిప్పలచ్చె"

"ఆ యమ్మ సేవల, లేని అలవాట్లకు మరిగి పైడితల్లి జిందగి బర్బాద్ జేసుకునె. ఆమెకేం, ఇంకో డ్రైవరు దొరుకుతడు, గని యాదమ్మ, పిల్లలు రస్త మీదికచ్చిరి గదా!" కొమురయ్య, భార్యతో ఏకీభవించాడు.

యాదమ్మ కోర్కెపై ఆమెను పంకజం గారి ఇంటికి తీసికెళ్లాడు కొమురయ్య.

"దండాలమ్మ! ఇగ మమ్ముల్ని మీరే ఆదుకోవాలె. మీరిచ్చిన పైసల్తోని అలవాటైన తాగుడు, మా కొంపముంచె. పైసలకు బదులు, గా వసుందరమ్మ లెక్క బోజనమిస్తే మా జిందగి గిట్ల బర్బాద్ గాకుండే. మములను నీటముంచినా, పాలముంచినా నీదే దయ" యాదమ్మ తన ఆక్రోశం వెళ్లగక్కింది.

"చూడు యాదమ్మా! నాకు చిరాకు తెప్పించకు. పని గంటలెక్కువౌతుంటే కనికరించి రోజు డబ్బులిచ్చేదాన్ని. వాటితో నీ మొగుడు తాగి తందనాలాడితే, అది నాతప్పా? ఇదిగో ఈ పాతిక వేలు తీసుకో. మళ్ళీ నీ మొహం నాకు చూపించి గొడవ చేసావంటే, బొక్కలో తోయిస్తాను. జాగ్రత్త. ఇక మీరు వెళ్లొచ్చు."

తాము చేయగలిందేమీ లేక, యాదమ్మ, కొమురయ్యా ఇంటి దారి పట్టారు.

"కొమురన్నా! మీ మేలు జన్మలో మర్సిపోను. ఇగ నువ్వే మాకు బతుకుదోవ సూపియ్యాలె" అంటూ రెండు చేతులెత్తి నమస్కరించింది యాదమ్మ.

"నువ్వేం బెంగ పెట్టుకోకు సెల్లెమ్మా! మందర్ని సూసుకుంటోడు, గా మీదున్నడు." అంటూ పైకి వేలు చూపిస్తూ, సజల నయనాలతో తమ ఇంటివైపు మళ్లాడు  కొమురయ్య.